manachourasta
# మన చౌరాస్తా
The Complete News way

మన చౌరాస్తా
Telugu News
Channel


సంపుటి : 01 | సంచిక : 198 | ఆదివారం | 12.01.2025

# ఆమె వెంటే.. ఆయన..

సృష్టిలో భార్యాభర్తల బంధం ఎంతో గొప్పది. ఈ బంధానికి మించింది ఏదీ లేదు. దేవతలు సైతం భార్యాభర్తల బంధానికి ప్రత్యేక పునాదుతో గొప్పతనాన్ని చాటారు పురాణాల్లో కథల్లో.. కాలం చెల్లేంత వరకు ఒకరికి ఒకరు తోడుగా ఉంటామని వైవాహిక జీవితంతో ఒకటవుతారు. కష్టసుఖాల్లోనూ కలకాలం కలిసి ఉంటారు. చివరకు ఎప్పుడో ఒక రోజు ఎవరో ఒకరు ఈ సృష్టిని వీడాల్సిందేనని గ్రహిస్తారు కూడా.. అందుకు తగ్గట్టుగానే కోటి ఆశలతో బతుకుతారు. అలా బతికిన ఓ జంట మరణంలో వారి బంధాన్ని కొనసాగించారు. భార్య మృతి చెందిన 12 గంటల్లోనే భర్త కూడా చనిపోయిన హృదయ విదారక ఘటనకు జనగామ జిల్లా పాలకుర్తి మండలం తీగారం గ్రామంలో జరిగింది.

- మన చౌరాస్తా, పాలకుర్తి

- మరణంలోనూ వీడని బంధం
- 12 గంటల వ్యవధిలోనే భార్యాభర్తల మృతి
- పాలకుర్తి మండలం తీగారంలో విషాదం





**జనగామ జిల్లా** పాలకుర్తి మండలం తీగారానికి చెందిన బైకాని కొమరయ్య (80)కు పాలకుర్తికి చెందిన సోమక్క(75)తో సుమారు 60 ఏళ్ల కిందట వివాహమైంది. వివాహ అనంతరం వారి దాంపత్య జీవితం ఎంతో గంపేడాశలతో సుఖసంతోషాలతో సాగింది. కష్టసుఖాల్లోనూ ఒకరికొకరు తోడుగా నిలిచారు. చివరకు కాలం సైతం వారిని కాటేసింది. సంతానం కలగకుండా అడ్డుపడింది. అయినా మొక్కవోని ధైర్యంతో జీవిత పోరాటాన్ని కొనసాగించారు ఆ దంపతులు. తమకు పిల్లలు లేరన్న బాధను దిగమింగుతూ బంధువుల పిల్లలను తమ పిల్లలుగా భావించి ముందుకు సాగారు. వారికి సైతం అడపాదడపా అన్ని అవసరాల్లో ఆసరాగా నిలిచారు. వ్యవసాయాన్ని నమ్ముకుంటూ ఇతర పనులతో వచ్చిన ఆదాయంతో సుఖంగా జీవించసాగారు. ఆప్యాయతలకు మారుపేరుగా నిలిచిన స్థానికులు, సహచర కుటుంబ సభ్యులు వారికి వెన్నంటే నిలిచారు. అయినా కాలం ఏదో ఒక రోజు వారిని విడదీయాలని పట్టుబట్టింది. శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో సోమక్క ఈ లోకాన్ని విడిచి వెళ్లింది. ఆమె మరణాన్ని స్వయంగా చూసిన భర్త ఒక్కసారిగా జీవచ్ఛంలా మారారు. ఉలుకు పలుకు లేకుండా మంచానికే పరిమితమయ్యారు. భార్య దహన సంస్కారాలు, ఇతర కార్యక్రమాలను కుటుంబ సభ్యులు, బంధువులు నిర్వహిస్తుండగా కన్నీళ్లు రాని కళ్ళతో చూస్తూ సహకరించారు. 12 గంటలు గడిచాయి. భార్య లేదన్న విషయం స్పష్టంగా అర్థమైంది. ఏం చేయాలో తెలియక ఒక్కొక్కరు కార్యక్రమానికి వచ్చి వెళ్ళిపోతున్నారు. బంధువులను చూసి కూలబడిపోయారు. చివరకు 'ఆమె లేని ఈ లోకంలో నేను ఉండలేను' అంటూ కొమరయ్య తనువు చాలించారు. 12 గంట వ్యవధిలో భార్యాభర్తల మృతితో తీగారం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించింది. సోమక్క, కొమరయ్యలకు సంతానం లేకపోవడంతో కొమరయ్య సోదరుడి కూతురు దాహన సంస్కారాలు నిర్వహించింది.



## నివాళలర్పించిన నాయకులు

పాలకుర్తి మండలం తీగారం గ్రామానికి చెందిన దంపతులు బైకాని సోమక్క, కొమరయ్య మృతి చెందిన విషయం తెలుసుకున్న కొడకండ్ల మాజీ మార్కెట్ చైర్మాన్ ఎర్రబెల్లి రాఘవరావు, పాలకుర్తి మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్ వారి మృత దేహాలను సందర్శించి నివాళులర్పించారు. వారి వెంట పాలకుర్తి మండల బీసీ సేల్ అధ్యక్షుడు బైకాని ఐలేష్ యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు కుమార్, కాంగ్రెస్ నాయకుడు మొగల్లు కుమార్, రాజిరెడ్డి, చారి ఉన్నారు.



## లాయర్లు అంకితభావంతో పనిచేయాలి

3

- హైకోర్ట్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి



## క్రీడలతో మానసికోల్లాసం.. దేహదారుఢ్యం..

3

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



## నేనే అసలైన ఉద్యమకారుడిని..

3

- జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి

General News

# ఈ నెలాఖరులోగా ఉస్మానియా ఆసుపత్రికి శంకుస్థాపన

- ఆ దిశగా చర్యలు చేపట్టండి
- భవిష్యత్ అవసరాలకనుగుణంగా ఆస్పత్రి డిజైన్లు ఉండాలి
- అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మన చౌరాస్తా :** ఈనెలాఖరులోగా కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణంపై శనివారం తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గోషామహల్ లో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వైద్యఆరోగ్య శాఖకు వీలైనంత త్వరగా బదిలీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్ లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అధికారులు సూచించిన మ్యాప్ లలో పలు మార్పులు, చేర్పులను సూచించారు సీఎం. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలన్నారు సీఎం. రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలన్నారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేదతీరేందుకు గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలన్నారు. ఈ నెలాఖరులోగా ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# ముఖ్యమంత్రి ఆదేశాలతోనే ఈ దాడి

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- అరాచక శక్తులకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని ఆవేదన



**హైదరాబాద్, మన చౌరాస్తా :** యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, పరిపాలన చేతకాని ముఖ్యమంత్రి రేవంత్ ఆదేశాలతోనే కాంగ్రెస్ నేతలు ఈ భౌతిక దాడులకు తెగబడుతున్నారని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. హోంమంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఆదేశాలతోనే కాంగ్రెస్ గూండాలు రెచ్చిపోయి, ఇలాంటి దాడులకు తెగబడుతున్నారు. కాంగ్రెస్ చేసిన మోసాలపై జిల్లాపార్టీ అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పే ధైర్యం లేకే ఇలాంటి దిగజారుడు చర్యలకు పాల్పడ్డారన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను నమ్మించి నయవంచన చేసిన మీ పాలనను ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టడం.. పాలనా వైఫల్యాలను ఎత్తిచూపిన ప్రధాన ప్రతిపక్షంపై దాడులు చేయడమే ఇందిరమ్మ రాజ్యమా ? అన్నారు. పదేళ్లపాటు ప్రశాంతంగా కొనసాగిన తెలంగాణ రాష్ట్రం, ఈరోజు అరాచకాలకు చిరునామాగా మారిందని, దాడులు, గుండాగిరి తమ మార్కు పాలన అని కాంగ్రెస్ పార్టీ మరోసారి నిరూపించుకుంటుందన్నారు. ప్రతిపక్ష పార్టీల కార్యాలయాలపైన దాడులు చేయడం కాంగ్రెస్ పార్టీ అలవాటుగా మారిందన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ప్రశాంతంగా ఉన్న తెలంగాణలో.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అరాచక శక్తులకు అడ్డూ అదుపూ లేకుండా పోయిందనీ, ఇందిరా రాజ్యం పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో గూండారాజ్యం చలాస్తుందన్నారు. చేతిలో రాజ్యాంగం పట్టుకుని ఫోజులు కొట్టే రాహుల్ గాంధీకి, రేవంత్ సర్కారు పాలనలో సాగుతున్న ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు కనిపించడం లేదా అన్న కేటీఆర్, రాహుల్ గాంధీ ఇప్పటికైనా తమ హిపోక్రసీని కట్టిపెట్టి, గుండాల చేతిలో చిక్కిన తెలంగాణ కాంగ్రెస్ సర్కారును సరిదిద్దాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని చెప్పడానికి ఇంతకన్నా నిదర్శనం ఇంకేం కావాలన్నారు. ఎన్నుకున్న ప్రజలతోపాటు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న బిఆర్ఎస్ కార్యకర్తలపై, నాయకులపై, పార్టీ కార్యాలయాల పైన దాడులు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కార్యాలయానికే రక్షణ లేకపోతే ఇక రాష్ట్రంలో పరిశ్రమలకు, పెట్టుబడులకు, మారుమూల పల్లెల్లో నివసిస్తున్న పేద, బడుగు బలహీనవర్గాల ప్రజలకు రక్షణ ఎక్కడ ఉంటుందన్నారు. ఇలాంటి దాడులతో బీఆర్ఎస్ ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీయాలని చూడటం ముఖ్యమంత్రి అవివేకం అన్న కేటీఆర్, సమైక్యరాష్ట్రంలో ఇంతకన్నా వందరెట్ల అణచివేతను, నిర్బంధాన్ని, దాడులను తట్టుకుని నిలబడిన తెలంగాణ ప్రజల గుండెచప్పుడుగా బీఆర్ఎస్ నిలిచిందన్నారు. మా పార్టీ కార్యకర్తల జోలికి, కార్యాలయాల జోలికి వస్తే తగిన గుణపాఠం చెప్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 60 లక్షల మంది బీఆర్ఎస్ కార్యకర్తలు కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజాక్షేత్రంలో తిరగగలరా ? ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే సహించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. వెంటనే బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలతో పాటు, వారి వెనుక ఉన్న కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మీరెన్ని దాడులు చేసినా, ఎన్నిరకాల అక్రమ కేసులు బనాయించినా తెలంగాణ ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటాం.. ప్రాణాలను ఫణంగా పెట్టి సాధించుకున్న రాష్ట్రాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేందుకు ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉంటామని కేటీఆర్ తెలిపారు.



# రేపటి నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

**మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి**

**సికింద్రాబద్, మన చౌరాస్తా :** సంక్రాంతి పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో సోమవారం నుంచి ఈనెల 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుదల చేశారు.“వివిధ రాష్ట్రాలకు చెందినవారు స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. ఇండోనేషియా, శ్రీలంక, కాఠ్‌మాండూ, స్కాట్‌లాండ్, మలేసియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ఫ్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. ఈ మూడు రోజులు ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.. ఎవరైనా పాల్గొనవచ్చు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివల్ ఉంటుంది. సంస్కృతిలో భాగమే ఈ పండుగలు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవాలి. తెలంగాణలోని ప్రాచీన కట్టడాలు, దేవాలయాలను పర్యటించాలి. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటు అందిస్తుంది’’ అని మంత్రి జూపల్లి తెలిపారు.



**రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న చింతల్ శివిర్ లో మంత్రి సీతక్కతో పాటు వివిధ రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రులు, అధికారులు పాల్గొన్నారు.**



# పద్మశాలి సంఘానికి విద్యానాథ్ విరాళం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** బచ్చన్నపేట మండల కేంద్రంలో మార్కండేయ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ నాయకులు జంగిటి విద్యానాథ్ రూ.5 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో వేముల బాలరాజు, మచ్చ నరేందర్, గుర్రపు బాలరాజు, బేతి కృష్ణమూర్తి, వేముల మురళి, శ్రీరాం శ్రీహరి, గోలి బుచ్చిరాజు, మామిడాల పాండు, వల్లాల శ్రీనివాస్, గణపురం నగేష్, వేముల రాములు, కుడికాల లక్ష్మణ్ వీరితో పాటు కాంగ్రెస్ నాయకులు బాలకిషన్ గౌడ్, మహాత్మాచారి పాల్గొన్నారు.

Local News



# లాయర్లు అంకితభావంతో పనిచేయాలి

- **హైకోర్ట్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి**

**చేర్యాల, మన చౌరాస్తా :** ప్రజలకు సత్వర న్యాయం అందాలంటే న్యాయవాదులు అంకితభావంతో పనిచేయాలని రాష్ట్ర హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేషన్ జడ్జి బి.విజయసేన్ రెడ్డి అన్నారు. శనివారం చేర్యాల పట్టణంలో ఫస్ట్ క్లాస్ సివిల్ జూనియర్ కోర్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల, కొమరవెల్లి, మద్దూరు, దూల్మిట్ట ప్రాంత ప్రజలకు న్యాయ సేవలు అందించేందుకు తాము బాధ్యతగా చేర్యాల పట్టణంలో కోర్టును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దానిని కాపాడుకునే బాధ్యత అందరి పైన ఉందన్నారు. లాయర్ ఉద్యోగం చాలా స్వేచ్ఛతో కూడుకొని ఉంటుందని, ప్రజలకు మంచి జరగాలంటే మీరు ఉత్సాహంగా పనిచేసి కేసులను కాలయాపన లేకుండా న్యాయ సేవలు అందించాలని, పేద మధ్యతరగతి ప్రజల దృష్టిలో పెట్టుకోవాలని అన్నారు. కుటుంబ తగాదా కేసులను సామాజిక స్పృహతో పరిష్కరించాలన్నారు. ప్రజల ఆర్థిక స్థితిగతులు గతంతో పోలిస్తే చాలా మెరుగ్గా ఉన్నాయని ప్రజల వద్ద డబ్బులు ఉన్నాయని, ఇప్పుడు పెరిగిన ఆర్థిక స్థితిని చూసి ఈ జనరేషన్ కష్టం విలువ తెలియకుండా పెరుగుతున్నారని, తల్లిదండ్రులు పిల్లలకు ఇవ్వాల్సింది ఆస్తులు కాదని మంచి విద్య, క్రమశిక్షణ, నైతిక విలువలను అందివ్వాలని అన్నారు. సీనియర్ లాయర్లు జూనియర్లకు అవకాశాలు కల్పించి వారిని వృత్తిపరంగా ఎదిగేలా ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్, సెషన్స్ జడ్జి సాయి రమాదేవి మాట్లాడుతూ చేర్యాల కోర్టు ఏర్పాటుకు సహకరించిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, బీసీ కమిషన్ మెంబర్ బాలలక్ష్మి హైకోర్టు జడ్జిని పూల బోకే శాలువాలతో సత్కరించారు. ఇన్‌చార్జి జిల్లా కలెక్టర్ అబ్దుల్ హమీద్, సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, మెదక్ జిల్లా జడ్జి, సిద్దిపేట, జనగామ, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు సభ్యులు, న్యాయవాదులు, న్యాయశాఖ ఉద్యోగులు పాల్గన్నారు.

# నేనే అసలైన ఉద్యమకారుడిని..

- **కేసీఆర్‌ది దొంగ ఉద్యమం**
- **తెలంగాణ సొమ్ము దోసుకుతిన్నడు**
- **డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి**




**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ కోసం కేసీఆర్ చేసింది ఏమీ లేదని, ఆయన ఒక దొంగ ఉద్యమం చేశాడని మాజీ ఎమ్మెల్యే, జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రథమ ఉద్యమకారుడిని తాననే.. సోనియా గాంధీ దయవల్ల 2014లో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరిగిందని ఆయన పేర్కొన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యమ కాలంలో పదవులు సంపాదించిన కేసీఆర్ కుటుంబం.. తెలంగాణ వచ్చిన తర్వాత ప్రజలను మోసం చేస్తూ అనేక అక్రమాలు, అవినీతి, మోసాలు, భూకబ్జాలు చేసి లక్షల కోట్లు సంపాదించారని ఆరోపించారు. ఉద్యమకారులను అణిచి వేసి బయటకు పంపి కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు మంత్రి పదవులు ఇచ్చారన్నారు. కేసీఆర్ కుటుంబం కావాలనే తమ సీఎం రేవంత్ రెడ్డి కుటుంబంపై అపనిందలు చేస్తోందన్నారు. రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాతే రాష్ట్రంలో సంక్షేమం మొదలైందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం రేవంత్ రెడ్డి అని అన్నారు. తెలంగాణకు ద్రోహం చేసిన కేసీఆర్ పాపం ఉత్తగ పోదని, ఆయన జైలుకు వెళ్లడం ఖాయం అన్నారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు చెంచారపు శ్రీనివాస్‌రెడ్డి, జనగామ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో సత్తా చాటాలి

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలని డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం జనగామ నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. నియోజవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు.



# వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లా

**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను శనివారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, తాజా మాజీ సర్పంచ్‌లు, బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు క్రీడాకారులతో కలసి ప్రారంభించారు. బీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ పోటీలకు మండల వ్యాప్తంగా 11 గ్రామాల నుంచి 22 టీమ్‌లు హాజరయ్యాయి. వాలీబాల్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా క్రీడాకారులను పరిచయం చేసుకున్నరు. క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, శారీరక దృఢత్వాన్ని కలిగి ఆరోగ్యవంతంగా ఉండడానికి దోహదపడతాయన్నారు. విద్యార్థులు, యువకులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని అన్నారు. కొమురవెల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ సార్ల లత కిష్టయ్యచే టాస్ వేయగా టాస్ ఎంపికలో ఐనాపూర్ గెలుచుకోగా ఐనాపూర్, గురువ న్న పేట టీంలు ప్రారంభమయ్యాయి. బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించినందుకు మండల స్థాయి యువకులకు క్రీడాలలో పాల్గొనడానికి గొప్ప అవకాశం కల్పించినందుకు ఫౌండేషన్ వ్యవస్థపకున్నీ ప్రత్యేకంగా అభినందించారు. ఫౌండేషన్ ద్వారా మండలంలోని ఆయా గ్రామల్లో నిరుపేద కుటుంబాలకు ఎంతో మందికి సాయం చేసేతందుకు ముందుకు వచ్చి తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొల్లపల్లి కిష్టయ్య, ఏర్పుల మహేష్, గొల్లపల్లి ఆంజనేయులు, కొండ శ్రీధర్, తలారి కిషన్, బడిగం వంశీ, మచ్చేందర్, కైత రహిందర్ రెడ్డి, పచ్చిమడ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.





# మాజీ సైనికుడికి ఘన స్వాగతం

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** దేశ రక్షణ కోసం సైన్యంలో చేరి 20 ఏళ్లు తన సేవలందిన ఉద్యోగ విరమణ పొందిన వచ్చిన బొడిగం తిరుమల్ రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బచ్చన్నపేట మండలంలోని ఇటికాలపల్లికి బొడిగం పుష్ప, చంద్రారెడ్డి దంపతుల ద్వితీయ కుమారుడు తిరుమల్ రెడ్డి 20 ఏళ్ల కింద దేశ రక్షణ కోసం సైన్యంలో చేరారు. తన విధులను సమర్ధవంతంగా నిర్వర్తించి 2024 డిసెంబర్ 31న ఉద్యోగ విరమణ పొందారు. శనివారం గ్రామానికి వచ్చిన ఆయనను గ్రామంలోని శ్రీసీతారామ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా తిరుమల్ రెడ్డి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అనంతరం మాట్లాడారు. దేశానికి సేవ చేయడం గొప్ప అదృష్టంగా భావించాలని, నేటి యువత దేశ రక్షణలో ముందు ఉండి దేశ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు.



## కీళ్ల నొప్పులపై

# సామ్ పోస్ట్..

హీరోయిన్ సమంత తన అభిమానులతో నిత్యం టచ్‌లో ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్) వేదికగా రెగ్యులర్‌గా పోస్టులు పెడుతూ తన జీవితంతో ముడిపడిన కీలక వివరాలను అందరితో పంచుకుంటూ ఉంటారు.  తాజాగా ఆమె ఇన్‌స్టాలో ఒక స్టోరీ పెట్టారు. ఇటీవలే తనకు చికెన్ గున్యా వచ్చిందని, దాని వల్ల అలుముకున్న కీళ్ల నొప్పుల నుంచి కోలుకుంటున్నానని సమంత వెల్లడిరచారు.  ఓ వైపు చికెన్ గున్యా బారినపడినా.. జిమ్ చేయడాన్ని ఆమె ఆపలేదు. ఈ పోస్ట్‌లో తాను జిమ్  చేస్తున్న ఒక ఫొటోను సమంత జతపరిచారు. “చికెన్ గున్యా వల్ల వచ్చిన కీళ్లనొప్పుల నుంచి కోలుకోవడంలోనూ చాలా ఫన్ ఉందండోయ్”  అనే కామెంటుకు బాధతో కూడిన ఎమోజీలను సమంత జతచేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.దీన్ని చూసిన నెటిజన్లు వేగంగా స్పందిస్తున్నారు. సమంత త్వరగా చికెన్ గున్యా నుంచి, కీళ్ల నొప్పుల నుంచి కోలుకోవాలని కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఫిట్‌నెస్, డైట్‌లపై సమంత ఎక్కువ ఫోకస్ పెడుతుంటారు.



## డాకు మహారాజ్

# విజయం తథ్యం

అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి వంటి వరుస ఘన విజయాల తరువాత గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మరో వైవిధ్యభరితమైన చిత్రం 'డాకు మహారాజ్'తో అలరించబోతున్నారు. బ్లాక్ బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య భారీ బడ్జెట్ తో 'డాకు మహారాజ్'ను నిర్మించారు. తమన్ సంగీతం అందించిన ఈ చిత్రంలో ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్ కథానాయికలు. బాబీ డియోల్, ఊర్వశి రౌతేలా, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషించారు. సంక్రాంతి కానుకగా ఆదివారం 'డాకు మహారాజ్' చిత్రం ప్రపంచ వ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం శుక్రవారం రాత్రి హైదరాబాద్ లో ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా 'డాకు మహారాజ్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇటీవల విడుదలైన థియేట్రికల్ ట్రైలర్ కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా విజువల్స్ అద్భుతంగా ఉన్నాయనే పేరు వచ్చింది. ఇక ఇప్పుడు రిలీజ్ ట్రైలర్ అంతకుమించి అనేలా ఉంది. 'వాడి ఒంటి మీద పదహారు కత్తి పోట్లు, ఒక బుల్లెట్ గాయం.. అయినా కిందపడకుండా అంత



మందిని నరకాడం అతను మనిషి కాదు, వైల్డ్ యానిమల్‘ అనే డైలాగ్ తో బాలకృష్ణ పాత్ర ఎంత శక్తివంతంగా ఉండబోతుందో తెలిపారు. అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలతో అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా ఈ చిత్రాన్ని రూపొందించారని రిలీజ్ ట్రైలర్‌తో మరోసారి స్పష్టమైంది. ప్రీ రిలీజ్ వేడుకలో గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ‘‘అఖండ, వీరసింహారెడ్డి, భగవంత్ కేసరి సినిమాల్లో నేను పోషించిన పాత్రలు ప్రేక్షకులను అలరించాయి.

